**ఆకాశవాణి హైదరబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 01.05.2026** **సమయం : 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.
2. నేర నియంత్రణతో పాటు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఏఐ సాంకేతికతను, డ్రోన్లను వినియోగిస్తామని నూతన డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు.
3. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.
4. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నేటి నుంచి నెల రోజుల పాటు ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

..............................................................................

**మే డే**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మే డే'ను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో కార్మిక దినోత్సవం, శ్రమ శక్తి, ఉత్తమ యాజమాన్య పురస్కారాల ప్రదానోత్సవంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, అబ్కారీ, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మంచిర్యాలలోని సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లో కార్మికులు, సంఘాల నాయకులు ఎర్రజెండాలను ఎగురవేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**(సౌండ్ బైట్ సీతారామయ్య)**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, నల్లగొండ జిల్లాలో సీపీఎం, బీఎంఎస్ తదితర సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో కార్మికులు భారీ ర్యాలీలు నిర్వహించారు.

(డెస్క్/ పీటీసీ మంచిర్యాల, ఆసిఫాబాద్/ నల్లగొండ/ సిరిసిల్ల)

**మేడే సీఎం**

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రామిక లోకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

.......HYD -PTC

**మేడే-కేసీఆర్**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక లోకానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు మేడే శుభాకాంక్షలు తెలిపారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికుల కష్టం, త్యాగాలు వెలకట్టలేనివని ఆయన కొనియాడారు.

.......HYD -PTC

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

విద్య తోనే అభివృద్ధి సాధ్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి  అన్నారు, అందుకే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యకు 23 వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు.

నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని కొండమల్లేపల్లి శివారులో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన, భూమి పూజ చేశారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగానే నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

.....పీటీసీ నల్లగొండ జిల్లా

**సీఎం-విద్య**

విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందించగలిగితే విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపుతారని అన్నారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి మొత్తం అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేయాలని ఆదేశించారు.

...... డెస్క్

**బుద్ధ పూర్ణిమ-సీఎం**

పవిత్రమైన బుద్ధ పూర్ణిమ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. కరుణ, దయ, సహనం, శాంతి మార్గాలను బుద్ధ భగవానుడు మానవాళికి అందించిన అమూల్యమైన బోధనలు నేటి సమాజానికి మార్గదర్శనం చేస్తున్నాయని అన్నారు.

.........డెస్క్

**సిరిసిల్ల-బుద్ధ పూర్ణిమ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో బుద్ధుడి విగ్రహాలు, చిత్రపటాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విశ్వ మానవాళికి ప్రేమ తత్వం, సహనం అహింస, శాంతిని పంచిన బుద్ధుడి బోధనలు ఆచరణీయమని వక్తలు పేర్కొన్నారు.

..........పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా

**ఆసిఫాబాద్ –జనగణన**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 2027 జనగణనలో భాగంగా ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు జరగనున్న మొదటి విడత ఇండ్ల గణనకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత కోరారు. ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు 10వ తేదీలోపు ప్రతి ఒక్కరూ సెన్సస్ వెబ్‌సైట్ ద్వారా 'స్వీయ గణన' చేసుకోవాలని, ఆ తర్వాత వచ్చే ఐడీని గణన సిబ్బందికి అందజేయాలని ఆమె సూచించారు.

**(వాయిస్ బైట్ జిల్లా కలెక్టరు కె.హరిత)**

..........ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

**డీజీపీ సీవీ ఆనంద్**

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్- డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ ఈరోజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని, పోలీసు శాఖను ఒక శక్తివంతమైన బ్రాండ్‌గా నిలుపుతామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఏఐ సాంకేతికతను, డ్రోన్లను వినియోగిస్తూ, రాష్ట్రస్థాయిలో 'ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ - రోడ్ సేఫ్టీ బ్యూరో'ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. డ్రగ్స్, నార్కోటిక్స్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీల ఏర్పాటు ద్వారా ర్యాగింగ్, మాదకద్రవ్యాల మహమ్మారిని అరికడతామని తెలిపారు. సైబర్ నేరాలు, భూ

దందాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, పోలీస్ శాఖలో సిబ్బంది కొరతను తీర్చేందుకు కొత్తగా 5 వేల నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నూతనంగా ఏర్పాటైన 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనర్గా డాక్టర్ తరుణ్ జోషి ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.

..........పీటీసీ హైదరాబాద్

**హాఫీజ్ పేట్ రైల్వే స్టేషన్- కిషన్ రెడ్డి**

దేశవ్యాప్త రైల్వే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా, రాష్ట్రంలోని హాఫీజ్‌పేట రైల్వే స్టేషన్ అత్యాధునిక హంగులతో ముస్తాబవుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సుమారు 29.21 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఆధునికీకరణ పనులు ప్రస్తుతం 99 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రయాణికుల సౌకర్యార్థం 12 మీటర్ల వెడల్పు కలిగిన ఫుట్-ఓవర్-బ్రిడ్జ్, 2 లిఫ్టులు, 2 ఎస్కలేటర్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయనని తెలిపారు.

......డెస్క్

**టిమ్స్ సనత్ నగర్**

హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు నేటి ఆసుపత్రిలో ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు నెల రోజుల పాటు కొనసాగే ఈ ట్రయల్ రన్‌లో భాగంగా, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అవుట్ పేషెంట్ , డయాగ్నసిస్ సేవలను రోగులకు అందించనున్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ వంటి కీలక విభాగాలతో సహా మొత్తం 22 విభాగాల్లో ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి.

.........పీటీసీ సంగారెడ్డి

**సిరిసిల్ల –కలెక్టర్**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా రేపు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ స్థాయి సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సభను ఏర్పాటు చేయాలని సూచించారు.

.......పీటీసీ, సిరిసిల్ల

**నాణ్యమైన విత్తనాల సరఫరాపై అవగాహన సమావేశం**

వరంగల్ జిల్లాలో రైతులకు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలు మాత్రమే అందేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యా రాణి అధికారులను, విత్తన డీలర్లను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ.. నాసిరకం లేదా నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

......వరంగల్ జిల్లా పీటీసి

**సిరిసిల్ల- స్టూడెంట్లు**

రాజన్న సిరిసిల్ల జిల్లాగంభీరావుపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల నుంచి ఇంగ్లిష్, కెమిస్ట్రీ, బోటనీ సబ్జెక్టుల నుంచి జిజ్ఞాస స్టూడెంట్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి తెలిపారు.ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

.......పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా